క్లుప్తంగా

బహుభాషా నటి శ్రీదేవి



విజయవాడ కల్చరల్: బహుభాషానటి శ్రీదేవి అని రాష్ట్ర నటీనటనాట్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం, దేశికా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటి, నిర్మాత శ్రీదేవి జయంతిని శుక్రవారం నిర్వహించారు. చిన్నతనంలో సినీ రంగంలోకి అడుగుపెట్టిన శ్రీదేవి దేశంలోని అగ్రనటుల సరసన నటించినట్లు తెలిపారు. సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సినీ రంగంలో ధృవతార శ్రీదేవి అని చెప్పారు. వివిధ సంస్థలకు చెందిన ప్రసూనా రామన్, చావా నరసింహారావు, చింతకాయల చిట్టిబాబు, కె. డేవిడ్‌రాజు, బి. వీరభద్రరావు, మాసాబత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు. గాయకులు శ్రీదేవి నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు.

అలరించిన సంగీత కచేరి



విజయవాడ కల్చరల్: లయనాద కళాస్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా దుర్గాపురం శివరామకృష్ణక్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. నోరి లక్ష్మీమనోజ్ఞ, నోరి గాయత్రి సోదరీమణుల గాత్ర సంగీతం, సంగీత విద్వాంసురాలు ఆర్.విజయలక్ష్మి, పారుపల్లి వయోలిన్ కచేరి, అలాగే రామకృష్ణయ్య సంగీత విద్యార్థులు విశ్వనాథ్, ఎ.మహేష్, వి. శరవణ, కె. ప్రసాద్‌ల మృదంగ లయ విన్యాసం, సోమయాజుల విష్ణుప్రియల గాత్ర సంగీతం మధురంగా సాగింది.

33 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 33 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 33 మందిపై ఐదో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిని శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపరచగా, ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ. 15వేలు చొప్పున, మిగతా 24 మందికి రూ. 10వేలు చొప్పున జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

గుణదల పీఎస్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు.. రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో పోలీసుల సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ మొత్తం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారికి త్వరితగతిన సేవలు అందించేందుకు పోలీసులు కృషి చేయాలని సూచించారు. న్యాయం కోసం వచ్చిన ప్రతి ఒక్కరికీ పీఎస్‌లో న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లు, నేరస్తుల కదలికలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా ఎస్‌ఐ మధుశ్రీ, రైటర్ సంతోష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల రైల్వేస్టేషన్ పరిసరాల్లో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను గుణదల పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన నిరంజన్, సాయికుమార్, వెంకట బాలాజీ, ఫియాజ్ అనే యువకులు ఇన్‌స్టాగామ్‌లో పరిచయం అయ్యారు. వీరు పాడేరు నుంచి గంజాయిని తీసుకువచ్చి గుణదల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఏసీపీ దామోదర్ ఆదేశాల మేరకు గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండని వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు తాండవం చేస్తున్నాయి. మారుతున్న వాతావరణం, స్థానిక నివాసిత ప్రాంతాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలతో బుడమేరు పరిసర ప్రాంతాల్లో విషజ్వరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. 57 నుంచి 64 డివిజన్ల వరకూ ఉన్న న్యూరాజరాజేశ్వరీపేట, సింగ్‌నగర్, వాంబేకాలనీ, నందమూరినగర్, పాయకాపురం, శాంతినగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, ఉడాకాలనీ, కండ్రిక ఏరియాల్లో జ్వరాల సమస్య అధికంగా ఉంది.

ఏ ఇంటిని కదిలించినా జ్వరాలే..

ఇంట్లో ఒక్కరికి వచ్చిన జ్వరం క్రమేపి ఆ ఇంటిల్లిపాదికి సోకుతుంది. దీంతో పిల్లలు, పెద్దలు అని తేడా



కండ్రికలోని ఓ హాస్పిటల్‌లో సెలైన్ ఎక్కించుకుంటున్న యువతి

లేకుండా జ్వరాల బారినపడి ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నివాసాల మధ్య చెత్త సరిగా తీయడం లేదని, కాలువల్లో మురుగు రోజుల తరబడి కదలకపోవడం వల్ల దోమలు, ఈగలు సమస్యలు పెరిగి జ్వరాలు అధికంగా వస్తున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కు..

న్యూఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సరిగా ఉండటం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కూలినాలి చేసుకుంటూ నిరుపేద ప్రజలు జ్వరాలు సోకితే ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా వెళ్తుంటారు. అయితే అక్కడ వైద్యులు సరిగా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులపైనే ఆధారపడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఇంజెక్షన్‌లకు, మందులకు అయిపోతున్నాయని, అదే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉంటే తమకు ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం వరద నీరు రావడం, తాగునీరు కలుషితం కావడం వల్ల కూడా జ్వరాల సమస్య అధికంగా ఉంటోందని పేర్కొంటున్నారు. స్థానిక పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని జ్వర పీడితులు కోరుతున్నారు.

వైద్యులు లేరు



న్యూఆర్ఆర్‌పేటలో జ్వరాల సమస్య చాలా ఎక్కువగా ఉంది. మాకు అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సరిగా ఉండటం లేదు. దీంతో మేమంతా ప్రైవేటు హాస్పటల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించి వైద్యులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నాం. – టి.బాల, సింగ్‌నగర్

ప్రత్యేక డ్రైవ్‌లు చేయాలి



నాకు ఇద్దరు పిల్లలు సంతానం. కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాం. మొదట మా బాబుకు జ్వరం వచ్చింది. ఆ తర్వాత నాకు, నా భార్యకు ఇంటిల్లిపాదికి జ్వరాలు వచ్చేశాయి. నాలుగు రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. – రాంబాబు, సింగ్‌నగర్

పల్లె ప్రగతితోనే వికసిత్ భారత్

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామాల సుస్థిర అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మిన మహాత్ముని ఆశయ సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. వీటి ఆసరాతో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ అభివృద్ధి సూచిక 2.0పై శుక్రవారం ఎంజీ రోడ్డులోని పంచాయతీరాజ్ శాఖ సమావేశ మందిరంలో కార్యశాల జరిగింది. మహాత్మాగాంధీ, డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలతో పాటు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఐరాస సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనలో భాగంగా గ్రామ పంచాయతీల సంస్థాగత సామర్థ్యాలను పెంచేందుకు, ప్రగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ పీఏఐ 2.0ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ సూచీ కింద గ్రామ పంచాయతీపై తొమ్మిది ఇతివృత్తాల్లో 147 సూచికలు ఉన్నట్లు వివరించారు. గ్రామ



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పంచాయతీల్లో ప్రగతిని అంచనా వేసేందుకు, డేటా ఆధారిత పాలనను ప్రోత్సహించేందుకు, కొత్త విధానాలు, ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సూచీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమష్టి భాగస్వామ్యంతో సూచికల్లో ప్రగతి సాధనకు కృషిచేయడం చెప్పారు. చేసిన కృషికి జాతీయ స్థాయి పురస్కారాల ద్వారా ప్రత్యేక గుర్తింపు కూడా లభిస్తుందని.. ఇందుకు ముప్పాళ్ల గ్రామమే ఉదాహరణ అని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, విజయవాడ డీఎల్‌డీవో ఎస్.నిర్మల జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై కూడా దృష్టిపెట్టాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలు, వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు కిషోర్, ఇక్బాల్ పాషా, రజియా, పద్మావతి, పావని తదితరులు పాల్గొన్నారు. అలాగే వాంబేకాలనీలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోనూ జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

సెయింట్ జాన్స్‌లో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలువురు కవుల వేషధారణలో పలు పద్యాలు, కవితలు చెప్పి విశేషంగా ఆకట్టుకున్నారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మరికొంత మంది విద్యార్థులు క్రీడాకారుల వేషధారణలతో పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగు కవయిత్రి, ఉగాది పురస్కార గ్రహీత, సాహితి రత్న బిరుదాంకితురాలు పి.కృష్ణవేణి పాల్గొని తెలుగు భాషా గొప్పతనాన్ని వివరించారు.



కాంపాక్టర్ బిన్నులు నిండకుండా చర్యలు తీసుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కాంపాక్టర్ బిన్నులలో 75 శాతం నిండిన వెంటనే వాటిని వాహనాలతో తొలగించాలని చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని మీటింగ్ హాల్లో ఆయన ప్రజా ఆరోగ్య విభాగం సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 శాతం డోర్ టూ డోర్ కలెక్షన్ జరగాలని, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లతో 50 శాతం భాగస్వామ్య వ్యవస్థ ఏర్పాట్లను ప్రోత్సహించాలని, ప్రస్తుతం నాలుగు ప్రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ అమలులో ఉండగా మిగతావి కూడా అదేవిధంగా ప్రోత్సహించాలని అన్నారు. సిబ్బంది అనుమతి లేకుండా విధులకు గైరుహాజరు కాకూడదని, ఆఫీస్ అనుమతితోనే సెలవు తీసుకోవాలని, వ్యాపారస్తులు రోడ్డుపైన వ్యర్థాలను పారవేయకుండా అవగాహన కల్పించే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి వ్యాపార సంస్థ ముందు చెత్తబుట్టను ఏర్పాటు చేసే విధంగా వాళ్లకి అవగాహన కల్పించాలని, నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవోహెచ్ డాక్టర్ కె. అర్జునరావు

ట్రేడ్ లైసెన్స్ లేనిదే వ్యాపారం చేయకూడదని, ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ పొందే విధంగా ఎప్పటికప్పుడు పరిశీలించాలని, లైసెన్స్ తీసుకున్న వ్యాపారస్తులు క్రమం తప్పకుండా రెన్యువల్స్ చేయించుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన రహదారులలో పరిశుభ్రపరిచే సమయంలో వారి రక్షణ దృశ్య రెడ్ కోన్స్ వాడాలని, యూనిఫామ్ హ్యాండ్ గ్లౌజెస్ కచ్చితంగా ఉండాలని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాసన్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్, రెడ్డి బయాలజిస్ట్ కేశవరావు, శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్రీడలు శారీరక ఆరోగ్యంతోపాలు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయని అర్జున అవార్డు గ్రహీత, ఫార్మర్ ఇండియన్ బ్లైండ్ క్రికెట్ టీం కెప్టెన్ ఐ. విజయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు వారికి నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ రెడ్డిని నిర్వాహకులు సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు జె.నాగేశ్వరరావు, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల బృందం

కొనసాగుతున్న చవితి వేడుకలు



వినాయకనగర్‌లో గణనాథుడు



వినాయకనగర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. మధురానగర్, ముత్యాలంపాడు, సత్యనారాయణపురం, రామకృష్ణాపురం, చుట్టుగుంట, మాచవరం, వినాయకనగర్, దుర్గాపురం, భానూనగర్ తదితర ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో ఏర్పాటు చేసిన సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకుడిని శుక్రవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కె.వరలక్ష్మి, నిర్వాహక ప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని కార్యసిద్ధి గణపతి ఆలయంలో స్వామివారికి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు చేశారు. పండుగలతో బంధాలు పటిష్టం అవుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు వంశీ, కె.నాగాంజనేయులు, బి. గాంధీ, సూరిబాబు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కండ్రికలో పూజలు చేసిన ఎమ్మెల్యే బొండా

వ్యర్థాల నుంచి సంపద సృష్టించేలా చర్యలు తీసుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా జరగాలని, వ్యర్థాల నుంచి సంపదను సృష్టించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం దుర్గాపురం, భానునగర్, అజిత్ సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్, డోర్నకల్ రోడ్డు, లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా జరగాలని, ప్రతిరోజు సేకరిస్తున్న వ్యర్థాలను సక్రమంగా నిర్వహించి వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే ప్రక్రియలో ఎలాంటి లోపం అంతరాయం ఉండకూడదన్నారు. ప్రతినిత్యం గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ ప్లాంట్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సింగ్‌నగర్‌లోని గార్బేజీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, వీఎంసీ అధికారులు

ప్రయాణికుడికి మర్చిపోయిన బ్యాగు అందజేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలులో బ్యాగు మర్చిపోయి రైలు దిగిపోయిన ప్రయాణికుడికి తిరిగి అందజేసిన ఘటన విజయవాడలో చోటుచేసుకుంది. విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ జె.వి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన రాఘవేంద్ర ప్రజాపతి పెయింటింగ్ వర్కు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 9.20 గంటలకు గుంటూరు స్టేషన్‌లో దిగాడు. అనంతరం చూసుకుంటే తనతో తెచ్చుకున్న బ్యాగును రైలులో మర్చిపోయినట్లు గుర్తించాడు. ఆ బ్యాగులో ఆయన వద్ద పనిచేస్తున్న వారికి జీతాలు చెల్లించేందుకు కావాల్సిన రూ. 1.50 లక్షల నగదు ఉంది. రైలు తరువాత విజయవాడ స్టేషన్‌లో ఆగనుండటంతో వెంటనే విజయవాడ జీఆర్పీ పోలీసులను ఫోన్ ద్వారా సంప్రదించి రైలు, బ్యాగు వివరాలు తెలియజేశాడు. వెంటనే స్పందించిన సిబ్బంది విజయవాడలో రైలు ఆగటంతో అందులో వెతికి బ్యాగును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగును తెరచి చూడగా అందులో రూ. 1.50 లక్షల నగదు, దుస్తులు ఉన్నాయి. బాధితుడిని పిలిపించి జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జె.వి రమణ నగదును అప్పగించారు. సకాలంలో స్పందించి పోయిందనుకున్న నగదును అప్పగించిన జీఆర్పీ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

గిడుగు రామ్మూర్తి సేవలు అనిర్వచనీయం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమానికి మూలపురుషుడు, బహుభాషా శాస్త్రవేత్త గిడుగు వెంకట రామ్మూర్తి సేవలు అనిర్వచనీయమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. గిడుగు జయంతిని సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ తెలుగు భాషా ఉద్యమంలో గిడుగు రామ్మూర్తి పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, రాజారమేష్, త్రివేణిరెడ్డి, ఎస్‌డీ బాబు, తోపుల వరలక్ష్మి, మాతా మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు, బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత పీవీఎన్ కృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

చిరస్మరణీయుడు గిడుగు

విజయవాడ కల్చరల్: తెలుగు వారందరికి చిరస్మరణీయుడు గిడుగు రామ్మూర్తి పంతులని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఠాగూర్ గ్రంథాలయం, మల్లెతీగ సాహిత్య వేదిక ఆధ్వర్యాన బందరురోడ్డులోని స్థానిక గ్రంథాలయంలో తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమనేత గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ వ్యవహారిక భాషను ప్రజలభాషగా తీర్చిదిద్దడానికి గిడుగు చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. మువ్వల జ్యోతి రచించిన అరవింద కథల సంపుటిని విద్యాసాగర్ ఆవిష్కరించారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ గిడుగు తెలుగు సాహితీవేత్తలను ఎందరినో వ్యవహారిక భాష ఉద్యమం వైపు నడిపించినట్లు తెలిపారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవీ, సాహితీవేత్త చొప్పా రాఘవేంద్ర శేఖర్, పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు కె.బాలకృష్ణ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ సమన్వయకర్త అరుణ, అధ్యాపకులు సత్యవాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు



అరవింద కథల సంపుటిని ఆవిష్కరించిన అతిథులు

మాకు రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించండి

- రిటైర్డ్ పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల వినతి
- పరిష్కరించే విధంగా చర్యలు : డీసీపీ సరిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉద్యోగ విరమణ పొందిన, సర్వీసులో ఉండి మృతి చెందిన పోలీసు కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సత్వరమే ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు విశ్రాంత పోలీసులు, మృతుల కుటుంబసభ్యులు డీసీపీ కేజీవీ సరితను కోరారు. రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులతో జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాలతో శుక్రవారం రిటైర్డ్ పోలీసులు, సర్వీసులో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులతో డీసీపీ సరిత సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో సుమారు 70 మంది రిటైర్డ్ పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ పోలీసులు మాట్లాడుతూ తమకు రావాల్సిన జీపీఎఫ్, లీవ్ నగదు, జీఐఎస్, పెండింగ్ బిల్స్, ఏపీ జీఎల్ఐ, బీమా, భద్రత, పెన్షన్, కార్పస్‌ఫండ్, కంపెషన్ జాబ్ తదితర బెనిఫిట్స్‌ను సత్వరమే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అడ్మిన్ డీసీపీ సరితను కోరారు. డీసీపీ సరిత సమస్యలకు గల కారణాలను పోలీస్ కమిషనర్ కార్యాలయ పరిపాలనా సిబ్బందిని అడిగి తెలుసుకుని త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిటైర్డ్ పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చి తెలియజేయాలని సూచించారు. పోలీసుల సంక్షేమానికి కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిపాలనా విభాగం ఏఓ సునీత, ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావు, ఆర్ఐలు శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు, పరిపాలనా విభాగానికి చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



రావాల్సిన బెనిఫిట్స్‌పై రిటైర్డ్ పోలీసులతో సమీక్ష జరుపుతున్న డీసీపీ కేజీవీ సరిత